సాక్షి నిర్మల్

బుధవారం । 13 । మార్చి । 2024



'పది'ంతల ఆత్మవిశ్వాసం

పదో తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు రాబట్టవచ్చని మానసికనిపుణులు, సబ్జెక్టు నిపుణులు సూచిస్తున్నారు. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ: 6:26	గురు : 5:04

గరిష్టం/కనిష్టం 38.5 /24.7

వాతావరణం

ఆకాశం నిర్మలంగా, వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

పన్నుల వసూలులో అలసత్వం వద్దు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో పన్నుల వసూలులో అలసత్వం వహించొద్దని, త్వరగా వంద శాతం పన్నులు వసూలు చేయాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. అలసత్వం వహించే అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపాలిటీల్లో పన్నుల బకాయిలు పేరుకుపోయాయని బకాయిలు చెల్లించనివారికి నోటీసులు జారీ చేయాలన్నారు. స్పందించని వారి ఆస్తులు జప్తు చేయాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో నిర్మల్ మున్సిపల్ కమిషనర్ రాజు, భైంసా మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఆర్ఐలు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈవో

లోకేశ్వరం/ముధోల్: ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని నిర్మల్ డీఐఈవో పరశురాంనాయక్ అన్నారు. లోకేశ్వరం, ముధోల్ మండల కేంద్రంలోని ఇంటర్ పరీక్ష కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలని సూచించారు. కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని చీఫ్ సూపరింటెండెంట్‌లను ఆదేశించారు. ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట సీఎస్ వెంకటేశ్వర్లు, డీవో హరిప్రసాద్, ఇంటర్ పరీక్ష కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, రవికిరణ్ ఉన్నారు.


రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం



నమాజ్‌కు హాజరైన అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ టౌన్: నెలవంక దర్శనం ఇవ్వడంతో మంగళవారం నుంచి ముస్లింల పవిత్ర రంజాన్ మాసం మొదలైంది. సోమవారం రాత్రి ప్రత్యేక నమాజ్ చేసిన ముస్లింలు మంగళవారం ఉదయం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ గుల్జార్ మార్కెట్‌లోని మసీదులో ప్రార్థనలు చేశారు. అనంతరం స్థానిక కౌన్సిలర్ తౌహీద్ ఉద్దీన్‌తో రంజాన్ ఏర్పాట్లపై చర్చించారు. ఖబరస్తాన్‌లో హరితహారం కింద మొక్కలు నాటాలని సూచించారు. ఆయన వెంట అజర్‌హుస్సేన్, అద్నాన్‌ఖాన్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 317 బాధితులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

భైంసాటౌన్: రాష్ట్ర ప్రభుత్వం 317 జీవోపై కమిటీ వేయడం హర్షనీయమని తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని తపస్ శాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం తెచ్చిన 317 జీవోతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర మనోవేదనకు గురయ్యారన్నారు. కమిటీ పేరుతో కాలయాపన చేయకుండా జీవో బాధితులకు వెంటనే న్యాయం చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ విధానం పునరుద్ధరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు గృహజ్యోతి పథకం వర్తింపజేయడం, పాఠశాలల్లో సర్వీస్‌మెన్ల నియామకానికి ప్రభుత్వం అంగీకారం తెలపడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.నవీన్‌కుమార్, వి.సుదర్శన్, నాయకులు జి.రాజేశ్వర్, ఆర్.రాజేశ్వర్, జి.అజయ్ కె.ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నేళ్లో వేచిన.. కొలువు



నిర్మల్‌ఖిల్లా: ఉమ్మడి రాష్ట్రంలో విడుదలైన నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకుని పరీక్ష రాసి ఉద్యోగాలకు ఎంపికైన డీఎస్సీ–2008 బాధితుల 16 ఏళ్ల నిరీక్షణ ఫలించింది. అప్పటి ట్రిబ్యునల్ మధ్యంతర తీర్పుతో ఎంపిక లిస్టు తారుమారై కొంతమంది అభ్యర్థులకు నష్టం వాటిల్లింది. అప్పటి నుంచి కోర్టుల చుట్టూ, అధికారుల చుట్టూ, పాలకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎట్టకేలకు ప్రస్తుత కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం మినిమమ్ టైంస్కేలుతో ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఈమేరకు మంగళవారం నిర్వహించిన కేబినెట్ సమావేశంలో ఆమోదం తెలిపింది.

ఇదీ నేపథ్యం...

2008, డిసెంబర్ 6న నాటి రాష్ట్ర ప్రభుత్వం 35 వేల పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించింది. ఎస్జీటీ పోస్టులను కామన్ మెరిట్ ప్రకారం భర్తీ చేస్తామని, వీటికి బీఈడీ, డీఈడీ అభ్యర్థులు అర్హులని పేర్కొన్నది. 50 రోజుల తర్వాత ఎస్జీటీ పోస్టుల్లో 30 శాతం డీఈడీ అభ్యర్థులకు కేటాయిస్తూ 2009, జనవరి 29న జీవో 28ని తీసుకువచ్చింది. దీంతో బీఈడీ అభ్యర్థులు కోర్టుకు వెళ్లగా కామన్ మెరిట్ ప్రకారం భర్తీ చేయాలని కోర్టు తీర్పు ఇచ్చింది. ప్రభుత్వం నియమించిన క్యాబినెట్ సబ్‌కమిటీ సైతం కామన్ మెరిట్ ప్రకారం భర్తీ చేయాలని సూచించింది. దీంతో నోటిఫికేషన్ ప్రకారమే ఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వం 2010, జూన్ 21న జీవో 27ను విడుదల చేసింది. దీని ప్రకారం అధికారులు నియామక కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించారు. జిల్లాల వారీగా కామన్ మెరిట్ ప్రకారం ఎంపికైన అభ్యర్థుల జాబితాను అధికారులు ప్రకటించారు. 2009, జూన్ 27న కౌన్సెలింగ్ మొదలైంది. ఈ క్రమంలో డీఈడీ అభ్యర్థులు పరిపాలన ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా.. జూన్ 28న కౌన్సెలింగ్‌పై స్టే విధించింది. జీవో 28 ప్రకారం 30 శాతం కోటా కల్పిస్తూ కౌన్సెలింగ్ నిర్వహించాలని ట్రిబ్యునల్ ఆదేశించింది. ఆ తర్వాత 30 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కొత్త మెరిట్ జాబితా విడుదల చేసి 2010లో ఉద్యోగాలు ఇచ్చారు. దీంతో మెరిట్ సాధించి ఉద్యోగం రాక ఉమ్మడి రాష్ట్రంలో దాదాపు 3,500 మంది బీఈడీ అభ్యర్థుల కలలు కల్లలయ్యాయి. ఇందులో తెలంగాణ అభ్యర్థులు 1,200 మంది వరకు ఉండగా ఉమ్మడి జిల్లాలో దాదాపు వంద మంది ఉన్నారు.

కోర్టు తీర్పులతో ముందుకు..

బీఈడీ అభ్యర్థులకు అనుకూలంగా 2013, జూలై 15న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. అయినా పలు కారణాలతో వీరికి ఉద్యోగాలివ్వలేదు. 2017, ఫిబ్రవరి 8న రాష్ట్ర హైకోర్టులో జస్టిస్ సంజయ్ కుమార్ నేతృత్వంలోని బెంచ్, 2022, సెప్టెంబర్ 27న హైకోర్టు ధర్మాసనం బీఈడీ అభ్యర్థులకు అనుకూలంగా తీర్పులు ఇచ్చాయి. పిటిషనర్లకు ఉద్యోగాలు ఇవ్వాలని ఆదేశించాయి. ఏపీలో దాదాపు రెండున్నరేళ్ల క్రితం డీఎస్సీ–2008 బాధితులకు కాంట్రాక్ట్ పద్ధతిలో అక్కడి ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఒకే నోటిఫికేషన్‌లో బాధితులు ఒక రాష్ట్రంలో ఉద్యోగాల్లో ఉండటం, ఒక రాష్ట్రంలో న్యాయం కోసం ఎదురుచూడటం సరికాదని ఫిబ్రవరి 8న రాష్ట్ర హైకోర్టు వ్యాఖ్యానించింది. డీఎస్సీ–2008 బాధితులపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచించింది. ప్రస్తుతం ఖాళీల్లో వారిని భర్తీ చేయాలని, కాంట్రాక్ట్ పద్ధతిలో అయినా ఉద్యోగాలు ఇవ్వాలని ఆదేశించింది. ఈ క్రమంలో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడంపై నిర్మల్ జిల్లాకు చెందిన డీఎస్సీ 2008 బాధిత అభ్యర్థుల సంఘం ప్రతినిధులు వినోద్, చంద్రశేఖర్, ప్రభ, ఇందూర్, రుక్మిణి, గంగాధర్, రాజేశ్వర్ తదితరులు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

వంద మంది వరకు బాధితులు..

2008లో నిర్వహించిన డీఎస్సీలో మెరిట్ జాబి తాలో ఎంపికైన బీఈడీ అభ్యర్థులకు ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇవ్వాలని రాష్ట్ర కేబినేట్ నిర్ణయించడంతో జిల్లాకు చెందిన అప్పటి బాధిత అభ్యర్థులలో హర్షం వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 100 మంది వరకు బాధిత అభ్యర్థులు ఉండగా, అందులో ఇతర ఉద్యోగాలలో కొంత మంది స్థిరపడినా మిగతా వారికి ప్రయోజనం చేకూరనుంది.

ఉద్యోగాలు ఇవ్వడం సంతోషం...



డీఎస్సీ 2008 నోటిఫికేషన్ ద్వారా పోటీ పరీక్షలో ఎంపికై కౌన్సెలింగ్ సమయంలో ట్రిబ్యునల్ ఇచ్చిన మధ్యంతరాల ఉత్తర్వుల వల్ల బీఎడ్ అభ్యర్థులమైన మేము మెరిట్ జాబితాలో ఉండి కూడా నష్టపోయాం. 16 సంవత్సరాలుగా ఉపాధ్యాయ ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం సంతోషం.

– సుద్దాల రాజేశ్వర్, డీఎస్సీ–2008 బాధిత అభ్యర్థి, కడెం

రెగ్యులర్ ప్రాతిపదికన ఇవ్వాలి...



హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులు మాకు అనుకూలంగా ఉన్నా గత ప్రభుత్వం తాత్సారం చేసింది. ఇప్పటికైనా మమ్మల్ని గుర్తించి ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇవ్వడం సంతోషం. చాలా సర్వీసు కోల్పోయాం. మినిమం టైం స్కేల్‌తో కాకుండా శాశ్వత ప్రతిపాదికన నియామక పత్రాలు అందించాలి.

– గంగాధర్, డీఎస్సీ–2008 బాధిత అభ్యర్థి, బీరవెల్లి, సారంగాపూర్ మండలం

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

• రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జిల్లా అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: భారత ఎన్నికల సంఘం ద్వారా ఏ క్షణంలోనైనా పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉందని, ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. కలెక్టర్లు, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఓటరు నమోదు, మార్పులు–చేర్పులకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన, వాటి సత్వర పరిష్కారం, 18 – 19 వయస్సు కలిగిన యువతను ఓటరు జాబితాలో నమోదు చేయడం, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, మోడల్ పీఎస్‌ల ఏర్పాటు, మరణించిన, వలస వెళ్లిన ఓటర్ల విషయంలో తీసుకోవాల్సిన చర్యలు, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల సిబ్బంది నియామకం, వారికి శిక్షణ తరగతులు నిర్వహించడం, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ర్యాండమైజేషన్, భద్రతాపరమైన ఏర్పాట్లు తదితర అంశాలను సమీక్ష చేశారు. జిల్లా ఎన్నికల అధికారులకు దిశానిర్దేశం చేశారు. సెక్టోరియల్ అధికారులతో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితాను సేకరించాలని తెలిపారు. వాటి వివరాలను సకాలంలో పంపించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని ఇప్పటికే నియమిస్తే శనివారం మొదటి ర్యాండమైజేషన్ చేయాలని సూచించారు. ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను కూడా ఒకే రోజున, ఒకే సమయంలో అన్ని జిల్లాల్లో చేపట్టాలని సూచించారు. ఎన్నికల సిబ్బందికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో సమర్థవంతమైన, స్పష్టమైన ఎలక్టోరల్ రోల్‌ను తయారు చేయాలని సూచించారు. ఎన్నికల షెడ్యూల్‌కు పెండింగ్‌లో ఉన్న ఫామ్స్ అన్నీ పూర్తి చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్లు కిశోర్‌కుమార్, నిర్మల్, ఉట్నూర్, భైంసా ఆర్డీవోలు రత్నకల్యాణి, జీవాకర్‌రెడ్డి, కోమల్‌రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాస్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ వద్దు



కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

• కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా

నిర్మల్‌చైన్‌గేట్: అంగన్‌వాడీ ఉద్యోగులను దొంగలుగా చిత్రీకరిస్తూ కేంద్రాల్లో సీసీ కెమెరాలు బయోమెట్రిక్ యంత్రాలు పెట్టాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బొమ్మెన సురేశ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక్క పూట బడితోపాటు మే నెల అంతా సెలవులు ఇవ్వాలన్నారు. సమ్మె హామీలను వెంటనే అమలు చేయాలని, హెల్పర్లకు పాత పద్ధతిలోనే ప్రమోషన్ కల్పించాలన్నారు. ఆన్‌లైన్ పని కోసం 5జీ డాటా టెక్నాలజీతో కొత్త ట్యాబ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లలిత, జిల్లా కోశాధికారి శైలజ, జిల్లా ఉపాధ్యక్షులు గంగామణి, విజయ, నాయకులు భాగ్యలక్ష్మి, పద్మ వర్ణమాల, స్వరూప, విజయలక్ష్మి, గంగామణి, రాజమణి వందన, తులసమ్మ పాల్గొన్నారు.

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

• డీఈవో రవీందర్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్ రూరల్: ఈనెల 18 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలు జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని జేవీఎన్ఆర్ పాఠశాలలో పరీక్షల నిర్వహణకు సంబంధించిన సీఎస్, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఎంఈవోలు, కస్టోడియన్ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. మొబైల్ ఫోన్లను సెంటర్‌లోకి అనుమతించొద్దని తెలిపారు. విద్యార్థులు కూడా ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురాకుండా చూడాలన్నారు. పరీక్షలు సీసీ కెమెరాల ఆధ్వర్యంలో నిర్వహించబడతాయన్నారు. తాగునీరు, కరెంటు సౌకర్యం, మెడికల్ సిబ్బంది తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల సహాయ కమిషనర్ పద్మ మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 8,923 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. 47 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 47 మంది సీఎస్‌లు, 47 మంది డీవోలు, ఐదుగురు కస్టోడియన్లు విధులు నిర్వహిస్తారన్నారు. పరీక్షలు పగడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ట్రిపుల్‌ఐటీలో యూత్ పార్లమెంట్



మాక్ పార్లమెంట్‌లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో మంగళవారం నెహ్రూయూత్ కేంద్రసంఘటన్, ట్రిపుల్‌ఐటీ ఎన్ఎస్ఎస్ వింగ్ సంయుక్తంగా నైబర్‌హుడ్ యూత్ పార్లమెంటు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటీలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. గ్రామీణ యువత దేశ నిర్మాణ ప్రక్రియలో భాగస్వాములు కావాలని సూచించారు. భారతదేశంలో ఆధునిక, లౌకిక, సాంకేతిక ప్రక్రియలతో ఉత్తమ పౌరులుగా మారడానికి నెహ్రూయూత్ కేంద్ర సంఘటన్ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. నెహ్రూ యువ కేంద్ర సంఘం యువజన కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. గంటన్నరపాటు మాక్ పార్లమెంట్ ప్రదర్శన జరిగింది. పార్లమెంటు వ్యవస్థ, ప్రభుత్వ పథకాలు, సభా కార్యక్రమాలను అడ్డుకోవడం ద్వారా ప్రజాధనం దుర్వినియోగం తదితర అంశాలను వివరిస్తూ విద్యార్థులు మాక్ పార్లమెంట్ కొనసాగించారు. మాక్ పార్లమెంట్ స్పీకర్‌గా మహబూబ్, ప్రతిపక్ష నేతగా విజయ్‌యాదవ్, ప్రధాన మంత్రిగా సంజన, వివిధ శాఖల మంత్రులుగా, పార్లమెంట్ సభ్యులుగా పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

జీరో బిల్లు పాట్లు!

జిల్లాలో 1.91 లక్షల మందిని గృహజ్యోతి పథకానికి అర్హులుగా గుర్తించగా, ప్రజాపాలనలో 1.13 లక్షల మంది మాత్రమే జీరో బిల్లు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇప్పటి వరకు 89 వేల మందికి మాత్రమే జీరో బిల్లులు జారీ చేశారు. మిగిలిన వారి వివరాలు తప్పుగా నమోదు కావడంతో జారీ చేయలేదు. అలాగే భైంసా డివిజన్‌లో మొత్తం 44,289 మంది ప్రజాపాలనలో జీరో బిల్లు కోసం దరఖాస్తు చేసుకోగా, 34,255 దరఖాస్తులను మాత్రమే అర్హులుగా గుర్తించారు. మిగిలిన దరఖాస్తుల్లో వివరాలు తప్పుగా నమోదు కావడంతో జీరో బిల్లులు జారీ కాలేదు. ఇప్పటి వరకు 24,053 మందికి జీరోబిల్లులు జారీ చేశారు.

• ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పులు
• కార్యాలయాలకు పరుగులు పెడుతున్న అర్హులు



భైంసాలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రం వద్ద దరఖాస్తుదారుల బారులు

భైంసాటౌన్: రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి అమలులో భాగంగా తెల్ల రేషన్‌కార్డుదారులకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ పథకం ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వినియోగదారులకు ఈనెల నుంచే విద్యుత్ సిబ్బంది జీరో బిల్లులు జారీ చేస్తున్నారు. దరఖాస్తు సమయంలో కనెక్షన్(యూఎస్సీ) నంబర్, రేషన్ కార్డు, ఆధార్ వివరాలు సరిగా నమోదు చేసిన వారికి జీరో బిల్లులు జారీ అవుతుండగా, దరఖాస్తులో తప్పులు దొర్లిన వారికి మాత్రం యథావిధిగా కరెంట్ బిల్లు వస్తోంది. దీంతో తమకు జీరో బిల్లులు రావడం లేదంటూ అర్హులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు తెల్లరేషన్ కార్డు ఉండి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా కరెంట్ బిల్లు వస్తే ఆందోళన చెందవద్దని, ధ్రువపత్రాలతో ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు. దీంతో జీరో బిల్లులు రాని వినియోగదారులు ప్రజాపాలన సేవా కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు.



నిర్మల్‌లో దరఖాస్తుల స్వీకరణ..

తప్పులతో తంటాలు...

రాష్ట్ర ప్రభుత్వం ఐదు గ్యారెంటీల అమలు కోసం ప్రత్యేకంగా వార్డు/గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రజాపాలన వేదికల్లో దరఖాస్తులు స్వీకరించారు. ఐదు గ్యారెంటీలకుగాను తెల్లరేషన్‌కార్డు, ఆధార్, కరెంట్ కనెక్షన్, ఎల్‌పీజీ కనెక్షన్, రైతు పట్టాపాస్ బుక్, తదితర వివరాలు, ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో దరఖాస్తులు చేశారు. అనంతరం విద్యుత్ సిబ్బంది సైతం లైన్‌మెన్ల ఏరియాల వారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజాపాలన దరఖాస్తుదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. అయితే దరఖాస్తు సమయంలో సరైన అవగాహన లేక కొందరు దరఖాస్తుదారులు విద్యుత్ సర్వీస్ నంబర్లు, ఇతర వివరాలు తప్పుగా నమోదు చేశారు. దీంతో ఇలాంటివారు ప్రస్తుతం జీరో బిల్లు రాక ఆందోళన చెందుతున్నారు. మరోమారు దరఖాస్తు చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

రెండు రోజుల్లో రివైజ్డ్ బిల్లులు..

తెల్ల రేషన్‌కార్డు ఉండి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నవారికి జీరో బిల్లులు జారీ చేస్తున్నాం. కొందరు దరఖాస్తు సమయంలో వివరాలు తప్పుగా నమోదు చేశారు. అలాంటి వారికి జీరో బిల్లు రావడం లేదు. మరోమారు సరైన వివరాలతో దరఖాస్తు చేసుకుంటే రెండు రోజుల్లో రివైజ్డ్ జీరో బిల్లులు జారీ చేస్తున్నాం. అర్హులైనవారు ఆందోళన చెందవద్దు.

– ఆదిత్య, ఏడీఈ, భైంసా

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

• కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
• కలెక్టరేట్‌లో ఘనంగా మహిళా దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మహిళా ఉద్యోగులు



మహిళా ఉద్యోగిని సన్మానిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళలతో కేక్ కట్ చేయించారు. మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మహిళలు అన్నిరంగాల్లో పురోగతి సాధిస్తున్నారన్నారు. దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ముఖ్యమైనదన్నారు. జిల్లా ఎస్పీగా మహిళ ఉండటం గొప్ప విషయమన్నారు. ఓటు హక్కు కల్పించిన తర్వాత మహిళల పురోగతి మొదలైందని తెలిపారు. మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై ఐక్యంగా పోరాడాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలు వంద శాతం ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ 'మహిళలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందినట్లు' అన్న అంబేద్కర్ మాటలను గుర్తుచేశారు. మహిళలను గౌరవించాలని, మహిళా సాధికారతకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. అనంతరం పోషణ పక్షం పోస్టర్‌ను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ నెలలో స్వీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గులు, మెహందీ పోటీల విజేతలను సన్మానించి, బహుమతులు అందజేశారు. అంతకుముందు వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీడబ్ల్యూవో రమేశ్, సీపీవో మల్లికార్జున్, ఎల్డీఎం చంద్రశేఖర్, సీడీపీవోలు, మహిళాప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన రాజరాజేశ్వర జాతర



కుభీర్: మండలంలోని పార్డి(బి)గ్రామంలో ఐదురోజులుగా నిర్వహిస్తున్న రాజరాజేశ్వర జాతర మంగళవారం ముగిసింది. చివరి రోజు కుస్తీపోటీలు నిర్వహించారు. తెలంగాణలోని వివిధ గ్రామాల నుంచి మల్లయోధులతోపా టు, మహారాష్ట్రకు చెందిన మల్లయోధులు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి రూ.8 వేలు బిద్రెల్లికి చెందిన సాయినాథ్ గెలుచుకున్నాడు. ద్వితీయ బహుమతి రూ.5 వేలు నాందేడ్‌కు చెందిన యోగేష్ గెలుచుకున్నాడు.

క్లుప్తంగా

బాసర చేరిన పాదయాత్ర



పాదయాత్రగా వస్తున్న భక్తులు

భైంసా(ముధోల్): మహారాష్ట్రలోని పండరీపూర్‌కు చేపట్టిన పాదయాత్ర మంగళవారం బాసరకు చేరుకుంది. నిజామాబాద్ జిల్లా నందిపేటకు చెందిన పల్లుట్ల శ్రీకేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్ ఆధ్వర్యంలో 250 మంది భక్తులతో పాదయాత్ర చేపట్టారు. బాసరలో సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నాక పండరీపూర్‌కు బయలుదేరి వెళ్లారు.

ఇసుక డంపులు స్వాధీనం



ఇసుక డంపుల వద్ద అధికారులు

నర్సాపూర్(జి): మండలంలోని అర్లి (కే) గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను మంగళవారం మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు 55 ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకుని త్వరలో వేలం వేస్తున్నట్లు ప్రకటించారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ ఏడీ క్రాంతి కుమార్, సీఐ శ్రీనివాస్, తహసీల్దార్ సోమ శ్రీనివాస్, ఎస్సై హన్మాండ్లు, ఆర్ఐలు వేణుగోపాల్, సుమలత, పంచాయతీ కార్యదర్శి పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



స్వర్ణ వాగును పరిశీలిస్తున్న ఏడీ

నిర్మల్: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని భూగర్భ, జలవనరుల శాఖ ఏడీ క్రాంతికుమార్ అన్నారు. సారంగాపూర్ మండలం ఆలూరులోని స్వర్ణ నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు మంగళవారం ఎస్సై చంద్రమోహన్, ఎంఆర్ఐ ముంతాజ్‌తో కలిసి నదిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఒకేరోజు నాలుగిళ్లలో చోరీ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

లోకేశ్వరం(ముధోల్): మండలంలోని కిష్టాపూర్‌లో ఒకేరోజు నాలుగిళ్లలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన సురేష్, నరేశ్, నవీన్, సాయవ్వ సోమవారం ఇళ్లకు తాళం వేసి బన్నపెల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి ఇళ్ల తాళాలు పగుల గొట్టి నరేశ్ ఇంట్లో బీరువాలో ఉన్న 15 గ్రాముల బంగారం, రూ.10వేల నగదు, నవీన్, సురేష్, సాయమ్మ ఇంట్లో ఐదువేల చొప్పున ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

జింకపిల్లపై కుక్కల దాడి

కుభీర్: మండలంలోని సోనారి గ్రామ శివారులో మంగళవారం దాహం తీర్చుకోవడానికి వచ్చిన జింకపిల్లపై కుక్కలు దాడిచేశాయి. గ్రామస్తులు కుక్కల బారినుంచి జింకపిల్లను విడిపించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. అటవీ బీట్ అధికారి లెనిన్ వచ్చి కుభీర్ వైద్యశాలలో వైద్యం చేయించి భైంసా రేంజ్ కార్యాలయానికి తీసుకెళ్లారు.

'పది'ంతల ఆత్మవిశ్వాసం



విద్యార్థుల సన్నద్ధతను పరిశీలిస్తున్న నిర్మల్ డీఈవో రవీందర్‌రెడ్డి (ఫైల్)

- పది జీపీఏ లక్ష్యంగా... • సన్నద్ధమవుతున్న విద్యార్థులు
- ఈ నెల 18 నుంచి ఎస్సెస్సీ పరీక్షలు • ఇప్పటికే ప్రీఫైనల్, ప్రత్యేక మోడల్ పరీక్షలు పూర్తి

పదో తరగతి పరీక్షలు మరో ఐదురోజుల్లో ప్రారంభం కానున్నాయి. అయితే సమయం సమీపిస్తున్న కొద్ది విద్యార్థుల్లో కొంతమేర ఆందోళన ఉన్నా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలను ఎదుర్కొంటే మంచి ఫలితాలు రాబట్టవచ్చని మానసికనిపుణులు, సబ్జెక్టు విషయ నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థి జీవితంలో పదో తరగతి అత్యంత కీలకం. తొలిసారిగా బోర్డు పరీక్షలు రాయనున్న విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల్లో సైతం ఎంతో ఉత్కంఠ నెలకొంటుంది. అయితే ఏడాదంతా చదివిన పాఠాలను మూడు గంటల్లో సమాధానాలు రాసి మంచి ఫలితాలను సాధించాల్సి ఉంటుంది. ఇక్కడ విద్యార్థికి ఒత్తిడి, ఆందోళన సహజమే. అయినా ప్రశాంతంగా ఉంటూ దృఢచిత్తంతో పరీక్షలు రాస్తే సానుకూల ఫలితాలు ఉంటాయి. రానున్న ఐదు రోజులు పాటించాల్సిన జాగ్రత్తలు, పరీక్షలను ఎదుర్కోవాల్సిన తీరును విషయ నిపుణులు ఇలా వివరిస్తున్నారు. – నిర్మల్‌ఖిల్లా

ఉమ్మడి జిల్లా వివరాలు	
జిల్లా	విద్యార్థుల సంఖ్య
నిర్మల్	8,923
ఆదిలాబాద్	10,511
మంచిర్యాల	9,637
కుమురంభీం	6,425

మాతృభాషను అశ్రద్ధ చేయొద్దు



మాతృభాషను అశ్రద్ధ చేయకుండా ప్రతీ పాఠ్యాంశాన్ని సంగ్రహాత్మకంగా చదవాలి. ఉపవాచకం చదవడం, ముఖ్య ఘట్టాలను సాధన చేయడం వల్ల స్కోరింగ్ పెరుగుతుంది. పరిచిత, అపరిచిత పద్య, గద్యాలను బాగా చదివి అర్థం చేసుకోవడం ద్వారా సమాధానాలు సులభంగా రాయవచ్చు. లేఖ, కరపత్రం, సంభాషణ, వ్యాసం, ఆత్మకథ, ఏకపాత్రాభినయం వంటివాటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఓవైపు సాధన చేస్తూనే మరోవైపు ఉల్లాసంగా ఉండాలి. సంధులు, సమాసాలు వంటివాటికీ సమయం కేటాయించి చదివితే పూర్తి మార్కులు సాధించవచ్చు.
– కొండూరి పోతన్న, తెలుగు విషయ నిపుణులు, జెడ్పీహెచ్ఎస్, వెల్మల్ బొప్పారం

పొందికగా రాస్తే హిందీకే మార్కులు



హిందీ జాతీయ భాష. ఇందులో ఎక్కువ మార్కులు సాధించడానికి అవకాశం ఉంటుంది. ప్యాసేజీ రైటింగ్‌లో ఇచ్చిన అంశాన్ని క్షుణ్ణంగా చదివితే జవాబులు ఈజీగా రాబట్టవచ్చు. ప్రతీ పాఠ్యాంశంలోని కవి పరిచయాన్ని పూర్తిగా చదవాలి. వ్యాకరణాంశాలు, భాషకి బాత్, అభ్యాసం చేయాలి. సంధులు, ఉపసర్గ వంటివి నేర్చుకుంటే సులభంగానే 10 జీపీఏ సాధించవచ్చు. ఇక పార్ట్ బి పైన కూడా కొట్టివేత, రాత దోషాలు లేకుండా రాయాలి. పద్యభాగం భక్తిపథ్, నీతి దోహే పాఠ్యాంశాలు ముఖ్యమైనవి.– కే.రేఖ, హిందీ పండిత్, జెడ్పీహెచ్ఎస్, మంజులాపూర్

కృత్యాలు, అనువర్తనాలు ఆకళింపు ముఖ్యం



భౌతిక రసాయన శాస్త్రాల్లోని ప్రతీ అంశానికి సంబంధించిన కీలక పదాలు చదవాలి. పాఠ్యాంశాల్లోని కృత్యాలు, బొమ్మలు, అనువర్తనాలు గుర్తించుకుని చదివితే జ్ఞాపకముంటుంది. రోజూ సమాధానాలను సాధన చేయడం ద్వారా మంచి మార్కులను సాధించవచ్చు. ఉపయోగాలు–అనువర్తనాలు చదవాలి. ప్రతీ యూనిట్ పూర్తయ్యాక పునఃశ్చరణ చాలా ముఖ్యం. గత పరీక్ష ప్రశ్నలను సాధన చేస్తే ప్రశ్నలు ఏ విధంగా అడుగుతున్నారో గ్రహించవచ్చు. – సీహెచ్. వందన, భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలు, జెడ్పీహెచ్ఎస్, భోసి

విశ్లేషణ ద్వారానే మంచి మార్కులు



సాంఘిక శాస్త్రంలో పాఠ్యాంశాలను విశ్లేషణ పూరితంగా చదివితే సులువుగా గుర్తుంటాయి. కీలక అంశాలు, దేశ, ప్రపంచ పటాలను సాధన చేయడం వల్ల స్కోరింగ్ చేయవచ్చు. భారతదేశ పటంలోని పీఠభూములు, తీరమైదాన ప్రాంతాలు, నదులు, రాష్ట్రాలు గుర్తించేలా ప్రాక్టీసు చేయాలి. ప్రపంచ పటంలో దేశాలు, ప్రధాన కార్యాలయాలు, సముద్రాలను గుర్తించగలగాలి. భూగోళం, భూగర్భ జలాలు, కుల వివక్ష, బాలిక విద్య వంటి అంశాలపై, భారతదేశ చరిత్ర వంటి విషయాలను విశ్లేషణచేస్తూ చదవాలి. ప్రతీ ప్రశ్నను అటెంప్ట్ చేయడం కీలకం.
– సిలారి మధు, సాంఘికశాస్త్ర విషయ నిపుణులు, నిర్మల్

ఇష్టపడి చదివితే ఇంగ్లిష్ ఈజీ



ప్రశ్న పత్రం తీసుకున్న తర్వాత అందులో ఉన్న ప్రశ్నలను చూసి ఆందోళన చెందకూడదు. క్షుణ్ణంగా చదివి ఏ ప్రశ్నకు ఎలాంటి సమాధానం రాయనున్నామో ఆకళింపు చేసుకోవాలి. పేరాగ్రాఫ్‌లోని పదాలను కాకుండా సమగ్రంగా అర్థాలు వచ్చే పదాలను ఉపయోగించడం వల్ల సమాధాన పత్రం దిద్దేవారికి మంచి భావన ఏర్పడుతుంది. బాగా వచ్చిన సమాధానాలను మొదట రాసి క్లిష్టతరమైనవి చివర్లో రాస్తే ఆలోచించడానికి సమయం ఉంటుంది.
– కదార్ల రవీంద్ర, ఆంగ్లభాషా విషయ నిపుణులు, నిర్మల్

పట్టు చిక్కితే గణితమే సరళం



గణితం అంటేనే విద్యార్థులు కష్టతరం, క్లిష్టతరం అని భావిస్తారు. కానీ తగిన సాధన చేస్తే గణితంలోనే ఎక్కువ మార్కులు సాధించే అవకాశం ఉంది. తగిన చిట్కాలు పాటించడంతో గణితంపై ఆసక్తి పెరుగుతుంది. సమితులు, రేఖా గణితం, సాంఖ్యాక శాస్త్రం, త్రికోణమితి వంటి పాఠ్యాంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. గ్రాఫ్ నిర్మాణాలకు సంబంధించిన సమస్యలను అభ్యసన చేయాలి. ప్రాక్టీస్ చేస్తే సమాధానాలు సులభంగా రాయవచ్చు. – అశోక్, గణితశాస్త్ర విషయ నిపుణులు, నిర్మల్

అభ్యసన దీపికలతో ప్రయోజనం



జీవశాస్త్రంలో బొమ్మలు గీయడం, ప్రయోగాలు నిజ జీవిత వినియోగం వంటి అంశాలపై వచ్చే ప్రశ్నల ద్వారా ఎక్కువ మార్కులు స్కోర్ చేయవచ్చు. విద్యార్థులకు అందించిన అభ్యసన దీపికలు ఇందుకు అనుకూలంగా ఉన్నాయి. పుస్తకంలోని కీలక అంశాలపై పట్టు సాధించాలి. – మధుసూదన్ దేశ్‌పాండే, జీవశాస్త్ర ఉపాధ్యాయులు, జెడ్పీహెచ్ఎస్, సోన్

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌పై ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ కల్పన కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రెండు నెలల శిక్షణ అనంతరం ప్రైవేట్ బ్యాంకుల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. 26 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు కలిగిన బీసీ అభ్యర్థులు ఈ నెల 15 నుంచి 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే 31న ఆన్‌లైన్‌లో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 08732–221280 నంబరులో సంప్రదించాలని సూచించారు.

స్టడీ మెటీరియల్‌కు దరఖాస్తులు

డీఎస్సీ ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు రూ.1,500 విలువ చేసే స్టడీ మెటీరియల్ అందించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల మందికి అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ నెల 14 నుంచి ఏప్రిల్ 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని బీసీ అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 99496 84959 నంబరులో సంప్రదించాలని సూచించారు.

డీఎస్సీ ఉచిత శిక్షణ

డీఎస్సీ ఉచిత రెసిడెన్షియల్ శిక్షణకు ఎస్సీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ అధికారి సునీత కుమారి, ఎస్సీ స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. డైట్, బీఎడ్ చేసిన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ అభ్యర్థులు ఈ నెల 12 నుంచి 26 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9494149416 నంబరులో సంప్రదించాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికపత్రం అందుకుంటున్న జిల్లా అధ్యక్షుడు కొడప సోనేరావు

ఆదిలాబాద్‌రూరల్: కొలాం హక్కుల పోరాట సమితి జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా టేకం రాజు, జిల్లా అధ్యక్షునిగా కొడప సోనేరావు, ఉపాధ్యక్షులుగా మడావి తుకారాం, కొడప బాపురావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొడప భీంరావు, కార్యదర్శిగా మడావి కిషన్, చాకటి గంగారాం, సహాయ కార్యదర్శులుగా మడావి భీంరావు, మడావి లక్ష్మణ్, కొడప రామారావు, ప్రచార కార్యదర్శులుగా సిడాం ఆనంద్‌రావు, కొడప జంగు, సంస్కృతి కార్యదర్శులుగా టేకం రావుజీ, టేకం పోతు, కుమ్ర నాగోరావు, మడావి చిన్ను, కోశాధికారిగా కుమ్ర జలపత్‌రావు, అధికార ప్రతినిధిగా ఆత్రం ముకుంద్‌రావు, సలహాదారులుగా ఆత్రం భీంరావు, కుమ్ర బాపూరావు, టేకం సోము, కార్యవర్గ సభ్యులుగా ఆత్రం జంగు, టేకం రాజు, మడావి అయ్యు, కొడప లక్ష్మణ్, నైతం అయ్యు, కొడప ధర్మరావు, కుమ్ర రాజేశ్వర్, మడావి రమేశ్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను శాలువా, పూలమాలతో సత్కరించారు.

ఐదుగురికి ఏడేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: అదనపు వరకట్నం కోసం వేధించిన ఐదుగురికి ఏడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.19వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ మంగళవారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి ఎం.గంగాసింగ్ తెలిపారు. 2018 ఏప్రిల్ 18న నిర్మల్ జిల్లా జయరాంనాయక్ తాండ పరిమండల్‌కు చెందిన స్వప్నకు బోథ్ మండలానికి చెందిన రాథోడ్ జయవంత్‌రావుతో వివాహమైంది. వరకట్నం కింద రూ.3 లక్షల నగదు, తులం బంగారం, మోటర్ సైకిల్ ఇచ్చారు. 15 రోజుల తర్వాత భర్త జైవంతరావు, అత్త ధావిత్రిబాయి, మామ సొమ్లు, బావలు శివరాం, ఆత్మారాం అదనపు కట్నం కోసం వేధించారు. వేధింపులు భరించలేక 2018 ఆగస్టు 11న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. బోథ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుకాగా పీపీ సంజయ్ కుమార్ వైరాగ్రే 19 మంది సాక్షులను ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పుచెప్పారు.

చిట్టీల వ్యాపారి అదృశ్యం?

బోథ్: మండల కేంద్రానికి చెందిన ఓ చిట్టీల వ్యాపారి వారం రోజులుగా కనిపించకపోవడంతో అతని వద్ద చిట్టీలు కట్టిన వారు ఆందోళన చెందుతున్నారు. కాగా ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పలు గ్రామాల్లో చిట్టీలు వేసిన వారు గ్రామానికి వచ్చి ఆరా తీస్తున్నారు. చిట్టీల వ్యాపారిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై రాము తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

ఆదిలాబాద్‌రూరల్: ఈ నెల 10న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన రైతు చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. మండలంలోని యాపల్‌గూడ గ్రామానికి చెందిన మహేందర్ (36)కు ఐదెకరాల భూమి ఉంది. 2018లో పట్టాకోసం దరఖాస్తు చేసుకున్నాడు. పట్టా కాకపోవడంతో మనస్తాపానికి గురై ఈ నెల 10న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

తానూరు(ముధోల్): ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బెల్‌తరోడా గ్రామానికి చెందిన బెంద్రివాడ్ పోశెట్టి (45) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై ఈ నెల 11న ఇంటినుంచి వెళ్లిపోయాడు. గ్రామ సమీపంలోని పెట్రోల్ బంక్ వెనుకాల ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం అటుగా వెళ్లిన రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధుడు మృతి



విఠల్ మృతదేహం

బోథ్: విద్యుత్‌షాక్‌తో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోటకె గ్రామానికి చెందిన కేంద్రె విఠల్ (66) మంగళవారం ఇంట్లో ఫ్యాన్ వేసేందుకు స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రెండిళ్లు దగ్ధం

- రూ.32 లక్షల ఆస్తినష్టం



వట్టోలిలో కాలిపోయిన నోట్లు

లోకేశ్వరం(ముధోల్): మండలంలోని వట్టోలిలో శివరాత్రి ఎగ్గం పెద్ద భూమన్న, ఎగ్గం నడ్పి సాయన్నకు చెందిన ఇళ్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైనట్లు ఆర్ఐ బాలకిషన్ తెలిపారు. గ్రామానికి చెందిన భూమన్న, నడ్పి సాయన్న కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఉదయం వివిధ పనుల నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం ఇళ్ల నుంచి మంటలు రావడంతో గమనించిన స్థానికులు భైంసా అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఘటనలో పెద్ద భూమన్న ఇంట్లో రూ.4.70లక్షల నగదు, నడ్పి సాయన్న ఇంట్లో రూ.2.60 లక్షల నగదుతో పాటు ఇంట్లోని సామగ్రి కాలిపోయాయి. ఆర్ఐ బాలకిషన్ పంచనామా నిర్వహించారు. రూ.32 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు ఆర్ఐ తెలిపారు. పూర్తి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

'మెస్ చార్జీలు విడుదల చేయాలి'



మాట్లాడుతున్న దామెర కిరణ్

ఎదులాపురం: పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలు, ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి దామెర కిరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని కార్పొరేటీకరణ చేసేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం పేరుకే ప్రజా ప్రభుత్వం అని చెప్తున్నప్పటికీ విద్యా రంగానికి మాత్రం మొండి చెయ్యి చూపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత వరకు విద్యారంగానికి మంత్రిని కేటాయించకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు.

జిల్లా కమిటీ రద్దు..

ఇప్పటి వరకు కొనసాగిన ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ రద్దు చేస్తున్నట్లు కిరణ్ తెలిపారు. జిల్లా కార్యదర్శిగా పనిచేసిన ఆత్రం నగేశ్ క్రమశిక్షణకు భిన్నంగా వ్యవహరించడంతో ఎస్ఎఫ్ఐ నుంచి బహిష్కరించినట్లు వెల్లడించారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. కన్వీనర్‌గా అగ్గిమల్ల సాయి చరణ్, కోకన్వీనర్లుగా కొట్నాక్ సక్కు, ఎస్కే సమీర్, కుమ్ర భీంరావు, కమిటీ సభ్యులుగా పోలపాక బన్ని, మగ్గిడి శివ శంకర్, వినోద్‌ను ఎన్నుకున్నారు.

క్షమాపణ చెప్పాలి..

జిల్లా కమిటీకి సమాచారం ఇవ్వకుండా తమను బహిష్కరించడాన్ని ఖండిస్తున్నట్లు ఆత్రం నగేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహిష్కరణను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

జాతీయస్థాయిలో రాణిస్తున్న విద్యార్థులు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): గిరిజన క్రీడా పాఠశాలల విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తున్నారని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డెప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్ అన్నారు. మంగళవారం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ మైదానంలో జిల్లా స్థాయి గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ శిక్షకులతో నిరంతర పర్యవేక్షణతో క్రీడా పాఠశాలల్లో శిక్షణ కొనసాగుతోందన్నారు. పోటీల్లో 182 మంది బాలురు, 102 మంది బాలికలు పాల్గొన్నారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, సహాయ గిరిజన క్రీడల అధికారులు హేమంత్, లక్ష్మణ్, గోపాల్, శ్రీనివాస్, రవీందర్, జల్పత్, ప్రతాప్‌సింగ్, కోచ్‌లు పాల్గొన్నారు.

దంచికొడుతున్న ఎండలు..







వేసవి ప్రారంభంలోనే ఎండలు దంచికొడుతున్నాయి. రోజురోజుకూ ఎండలు పెరిగిపోతుండడంతో మధ్యాహ్న సమయంలో ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి. మార్చిలోనే పరిస్థితి ఇలా ఉంటే ఏప్రిల్, మే మాసాల్లో ఎలా ఉంటుందోనని జనాలు బెంబేలెత్తుతున్నారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలో పలువురు ఎండ నుంచి రక్షణగా రక్షణ కవచాలు ధరించి వెళ్తుండగా 'సాక్షి' క్లిక్ మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్